సాక్షి వికారాబాద్

గురువారం । 12 । డిసెంబర్ । 2024



ఘనంగా గీతా జయంతి

వికారాబాద్‌లో గీతా వాహిణి ఆధ్వర్యంలో ఏకాదశిని పురస్కరించుకుని గీతా జయంతి నిర్వహించారు. 12లో▸



గణితంపై పట్టు సాధించాలి

కష్టంతో కాకుండా ఇష్టంతో గణితాన్ని నేర్చుకోవాలని మ్యాథమెటిక్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ సూచించారు. 12లో▸



'పంచాయతీ' సందడి

త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనుండటంతో పల్లెల్లో సందడి వాతావరణం నెలకొంది. 13లో▸

న్యూస్‌రీల్

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఎస్పీ నారాయణరెడ్డి

అనంతగిరి: లోక్ అదాలత్‌లను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ నారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. ఈ నెల 14న వికారాబాద్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. రాజీకి అవకాశం ఉన్న కేసులను రాజీ చేసుకోవచ్చని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ సూచించారు.

నేడు, రేపు జిల్లా స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్



డీఈఓ రేణుకాదేవి

అనంతగిరి: వికారాబాద్ పట్టణ పరిధిలోని కొత్తగడి గురుకుల పాఠశాలలో గురు, శుక్రవారాల్లో జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్‌స్పైర్ ప్రదర్శన (2023–24) నిర్వహించనున్నట్లు డీఈఓ రేణుకాదేవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏడు ఉప అంశాల్లో నూతన ఆవిష్కరణలతో పాల్గొనవచ్చని తెలిపారు. టీచర్ ఎగ్జిబిట్స్‌లో నూతన బోధనా భ్యసన సామగ్రిని ప్రదర్శించవచ్చని తెలిపారు. డీఎస్, బీఎడ్ విద్యార్థులు సైతం ప్రదర్శించవచ్చన్నారు. గురువారం సాయంత్రం మిల్లెట్స్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్, హెల్త్ అనే అంశంపై సెమినార్ ఉంటుందన్నారు. జూనియర్ (6, 7, 8), సీనియర్(9, 10) విభాగాల్లో ప్రతి ఉప అంశానికి ఒకరు చొప్పున ఒక పాఠశాల నుంచి అత్యధికంగా 14 ప్రాజెక్టుల్లో పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఒక పాఠశాల నుంచి ఒక గైడ్ టీచర్ మాత్రమే పాల్గొనాలని తెలిపారు. ఇన్‌స్పైర్‌కు ఎంపికైన పాఠశాలలు ఇందులో పాల్గొనరాదని సూచించారు.

క్రమం తప్పకుండా మందులు వాడితే క్షయ దూరం

జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ రవీంద్రయాదవ్



క్షయ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కొడంగల్ రూరల్: క్షయ సోకిన వ్యక్తులు క్రమం తప్పకుండా మందులు వాడితే వ్యాధి నయం అవుతుందని జిల్లా క్షయ నియంత్రణ అధికారి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ రవీంద్రయాదవ్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో క్షయవ్యాధిపై వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పరీక్షలు నిర్వహిస్తూ రోగులను గుర్తించి మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వ్యాధి సోకిన వ్యక్తులు భయాందోళనకు గురికారాదని, ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఇచ్చే మందులను క్రమంగా వాడాలని సూచించారు. 130 మందికి పరీక్షలు నిర్వహించగా 9 మందికి క్షయ వ్యాధి సోకినట్లు వైద్యులు గుర్తించారు. వారి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ విద్యప్రియ, డాక్టర్ సాకేత్, డాక్టర్ జ్యోతి, సూపర్‌వైజర్లు ఎండీ రఫీ, మధుసూదన్‌రెడ్డి, రాహత్, టీబీ అలర్ట్ ఇండియా సభ్యులు సాయి శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి లగోరి పోటీలు



మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

అనంతగిరి: హైదరాబాద్‌లోని ఉప్పల్ సృజన ఉన్నత పాఠశాలలో ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు 8వ రాష్ట్ర స్థాయి సీనియర్ లగోరి మీట్ నిర్వహించనున్నట్లు లగోరి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ తెలిపారు. బుధవారం వారు వికారాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ పోటీలకు రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి క్రీడాకారులు వస్తారని తెలిపారు. ప్రతిభ చూపిన వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు అమరేందర్‌రెడ్డి, శివరాజుగౌడ్, రమేష్‌కుమార్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

మారని పరిస్థితి!



రెండు రోజుల క్రితం తాండూరులో అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

అధ్వానంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు

- తరచూ ఫుడ్ పాయిజన్ ఘటనలు
- ఆస్పత్రుల పాలవుతున్న విద్యార్థులు
- అయినా మారని అధికారుల తీరు
- ఘటనలు జరిగినప్పుడు హడావుడి
- ఆ తర్వాత పరామామూలే..

వికారాబాద్: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు అధ్వానంగా తయారయ్యాయి. హాస్టళ్లలో పరిస్థితులు నానాటికీ తీసికట్టుగా మారుతున్నాయి. సంబంధిత శాఖల హెచ్‌ఓడీలు పర్యవేక్షణను గాలికి వదిలేయడంతో వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రతిసారీ ఏదో ఒక హాస్టల్‌లో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై ఆస్పత్రుల్లో చేరడం సర్వసాధారణమయ్యింది. విద్యార్థులు ఏడాదంతా సమస్యలతో సహవాసం చేయాల్సి వస్తోంది. ఈ ఏడాది విద్యా సంవత్సరం మొదలైన నాటి నుంచి విద్యార్థులు అస్వస్థతకు గురవుతూనే ఉన్నారు. ఆగస్టులో నస్కల్ కేజీబీవీలో 26 మంది విద్యార్థులు అస్వస్థతకు గురికాగా సెప్టెంబర్‌లో మరో రెండు వసతి గృహాల్లో విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారు. గతంతో వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లి బాలుర వసతి గృహంలో విద్యార్థులు కళ్ల పసకలతో ఆస్పత్రిలో చేరగా.. బూర్గుపల్లి బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు విష జ్వరాలతో ఆస్పత్రి బాట పట్టారు. తాజాగా తాండూరు ఎస్టీ బాలికల వసతి గృహంలో విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురై ఆస్పత్రి బెడ్ ఎక్కారు. గత వారం కలెక్టర్ ప్రతీక్‌జైన్ జిల్లా ఉన్నతాధికారులకు హాస్టళ్ల సూక్ష్మ పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఆయా శాఖల హెచ్‌ఓడీలను మండలాల ప్రత్యేకాధికారులుగా నియమించారు. వారంలో రెండు స్కూళ్లు, హాస్టళ్లు సందర్శించాలని ఆదేశించారు. ప్రతి చోట పరిస్థితులను చక్కదిద్దాలని సూచించారు. అయినా పరిస్థితి మారడంలేదు.

తూతూమంత్రంగా మెనూ

ఓ పక్క ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నా సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. సన్న బియ్యంతో అన్నం, రకరకాల కూరగాయలతో వంటలు చేసి భోజనం పెడుతున్నామని చెబుతుండగా వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఇటీవలే భోజనం, కాస్మొటిక్ చార్జీలను ప్రభుత్వం పెంచింది. మెనూ కలర్‌ఫుల్‌గా కనిపిస్తున్నా దాన్ని ఫాలో అయిన పాపానపోవడం లేదు. చాలా హాస్టళ్లలో పారిశుద్ధ్య సమస్యలు వెంటాడుతున్నాయి. మంచి భోజనం పెట్టమని అడిగితే వార్డెన్ తిడుతున్నారని చౌడాపూర్ మండలంలోని విద్యార్థులు ఆందోళనకు దిగిన సంఘటన కూడా గతంలో చోటుచేసుకుంది.

పర్యవేక్షణ గాలికి..

వసతి గృహాలను ఉన్నతాధికారులు పర్యవేక్షించకపోవడంతో వార్డెన్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలో సోషల్ వెల్ఫేర్, బీసీ, ఎస్టీ, మైనార్టీ వెల్ఫేర్, స్త్రీ శిశు సంక్షేమం, గురుకుల, కేజీబీవీ హాస్టళ్లు ఉన్నాయి. ఇందులో పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లు కలిపి ఒక్కో శాఖలో 20 నుంచి 25 హాస్టళ్లు ఉండగా వంద పైచిలుకు సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయి. మైనార్టీ వెల్ఫేర్ జిల్లా అధికారి ఉద్యోగ విరమణ పొందగా ఆ బాధ్యతలు యువజన విభాగం, క్రీడల శాఖ జిల్లా అధికారికి అప్పగించారు. ఇక గురుకులాలను పర్యవేక్షించే ఆర్‌సీఓలు చుట్టపుచూపుగా వచ్చి వెళ్లటం తప్ప వారికి సమస్యలు పట్టడంలేదు. ఫుడ్‌పాయిజన్, సమస్యలపై విద్యార్థులు ధర్నాలు, ఆందోళన బాట పట్టే వరకు ఉన్నతాధికారులు హాస్టళ్ల వైపు కన్నెత్తి చూడటం లేదు. చిన్న చిన్న సమస్యలను సైతం పరిష్కరించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలపై దృష్టి సారించాలని విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

సారూ.. మాకు న్యాయం చేయండి

తహసీల్దార్‌ను కోరిన అప్పాయిపల్లి రైతులు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

కొడంగల్: 'సారూ.. మాకు న్యాయం చేయండి' అంటూ మండలంలోని అప్పాయిపల్లి గ్రామ రైతులు బుధవారం తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. అప్పాయిపల్లి సర్వే నంబర్ 19లో ప్రభుత్వ మెడికల్ కళాశాల కోసం స్థలం సేకరించించారు. రైతుల వద్ద భూములు తీసుకొని ఎకరాకు రూ.10 లక్షలు, ఒక ప్లాట్, ఒక ఉద్యోగం ఇస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అయితే అధికారులు చెప్పిన లెక్కల ప్రకారం తమకు పరిహారం అందలేదని రైతులు ఆరోపించారు. నాలుగు నెలల క్రితం రైతుల దగ్గర నుంచి భూమి తీసుకున్నారని, ఇప్పటి వరకు పూర్తిగా పరిహారం చెల్లించలేదన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల కోసం ఇచ్చిన భూముల్లో ఎలాంటి పనులు చేపట్టరాదని రైతులపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని కోరారు. అలాగే పూర్తి పరిహారం ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు పకీరప్ప, మోతీబాయి, రాములు గౌడ్, వెంకటమ్మ, మల్లప్ప, శేఖర్, కిష్టప్ప, బసప్ప, వెంకటప్ప, సంగప్ప, బాలరాజు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల వివరాలు పక్కాగా ఉండాలి

రంగారెడ్డి జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

శంకర్‌పల్లి: ఇందిరమ్మ యాప్‌లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి అన్నారు. శంకర్‌పల్లి పట్టణం, మండలంలో బుధవారం ఆయన పర్యటించారు. మండల పరిషత్ కార్యాలయంలో, మండలంలోని మోకిల పంచాయతీలో రికార్డులు తనిఖీ చేశారు. తర్వాత పల్లె ప్రకృతివనం, నర్సరీ, క్రీడా ప్రాంగణాన్ని సందర్శించారు. మోకిల తండాలో ఇందిరమ్మ యాప్‌లో లబ్ధిదారుల నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో తమకు కేటాయించిన పనిని పక్కాగా చేయాలని అధికారులకు సూచించారు. ఏవైనా ఇబ్బందులు తలెత్తితే ఉన్నతాధికారులను సంప్రదించాలన్నారు. నిర్లక్ష్యంగా ఉంటే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ గిరిరాజు, సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, ఏపీఓ నాగభూషణం, మోకిల సెక్రెటరీ ఎల్లయ్య, మోకిల తండా సెక్రెటరీ శ్రీకాంత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు

- సెర్ప్ డైరెక్టర్ గోపాల్‌రావు
- పింఛన్ల పంపిణీపై క్షేత్రస్థాయి పరిశీలన



కొత్లాపూర్‌లో పింఛన్ల రికార్డులను పరిశీలిస్తున్న సెర్ప్ అధికారుల బృందం

తాండూరు రూరల్: పింఛన్ల పంపిణీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సెర్ప్ డైరెక్టర్ గోపాల్‌రావు హెచ్చరించారు. ఆసరా పింఛన్ల పంపిణీపై సెర్ప్ అధికారుల బృందం బుధవారం తాండూరు మండలంలో తనిఖీలు నిర్వహించారు. సెర్ప్(పెన్షన్ స్కీం) డైరెక్టర్ గోపాల్‌రావు, ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్, డీపీఎం నర్సింలు, ఏపీఎం కమలాకర్ బృందం తాండూరు మండలం కొత్లాపూర్, బెల్కటూర్ గ్రామాల్లో పర్యటించింది. మండలంలో 6వేల మంది లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ విశ్వప్రసాద్ అధికారుల బృందానికి తెలిపారు. ఆ తర్వాత బృందం సభ్యులు లబ్ధిదారులతో నేరుగా మాట్లాడారు. ప్రతి నెల పెన్షన్ అందుతోందా? ఏ తేదీలో ఇస్తున్నారు అనే విషయాలు అడిగి తెలుసుకున్నారు. పింఛన్లకు సంబంధించి అన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం జీపీలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో ఎంత మందికి పింఛన్లు వస్తున్నాయి.. చనిపోయిన వారు పేర్లు తొలగించారా అని అడిగారు. బయోమెట్రిక్ సరిగ్గా పని చేయని సమయంలో పంచాయతీ కార్యదర్శి, పోస్ట్‌మెన్ సంయుక్తంగా అథెంటికేషన్ ద్వారా లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు ఇవ్వాలని సెర్ప్ అధికారుల బృందం ఆదేశించింది. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, ఏపీఎం ఆనంద్, పంచాయతీ కార్యదర్శులు పార్వతమ్మ, బాలకృష్ణ పాల్గొన్నారు.

హాస్టళ్ల నిర్వహణలో అలసత్వం వద్దు

- విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి
- గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్‌కుమార్
- తాండూరులోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు
- పాల్గొన్న కలెక్టర్ ప్రతీక్‌జైన్



తాండూరు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న శరత్, ప్రతీక్‌జైన్

తాండూరు: ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ ఏ శరత్ హెచ్చరించారు. బుధవారం తాండూరు పట్టణం సాయిపూర్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి తనిఖీ చేశారు. మంగళవారం అల్పాహారం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురికావడంపై ఆరా తీశారు. ఫుడ్ పాయిజన్ కావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమ పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో వార్డెన్, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పిల్లల ఆరోగ్యం పట్ల బాధ్యతగా ఉండాలని సిబ్బందికి సూచించారు. అనంతరం వంటగది, స్టోర్ రూంను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. రోజూ ఇలాంటి భోజనమే పెడుతున్నారా అని విద్యార్థులను అడగారు. ఈ రోజు భోజనం బాగుందని విద్యార్థులు తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. తాగునీటి నాణ్యతను పరిశీలించేందుకు 12 వేల హెచ్‌టూఎస్ టెస్ట్ వైల్ కొనుగోలు చేశామని తెలిపారు. వీటిని అన్ని పాఠశాలలకు సరఫరా చేయనున్నట్లు చెప్పారు. మంగళవారం అస్వస్థతకు గురైన విద్యార్థుల్లో ఇద్దరు ఇంకా కోలుకోలేదని.. హాస్టల్‌లోనే వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 13మంది ఆరోగ్యం బాగుందన్నారు. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చందన, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

భోజనంలో రాజీపడొద్దు



పరిగి గిరిజన గురుకులంలో వంట సరుకులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- బియ్యం సరిగ్గా లేకుంటే వెనక్కి పంపండి
- కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి: విద్యార్థులకు అందించే భోజనంలో రాజీ పడొద్దని, నాణ్యమైన ఆహారం అందించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. బుధవారం పరిగి పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలె బాలికల గురుకుల పాఠశాల, గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి, వంట గదులను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న తీరును దగ్గరుండి పర్యవేక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. హాస్టళ్లకు పౌరసరఫరాల శాఖ పంపిణీ చేసే బియ్యం సరిగ్గా లేకుంటే వెనుక్కు పంపాలని ఆదేశించారు. బియ్యం సరిగ్గా లేకుంటేనే సమస్యలు వస్తాయన్నారు. రోజూ తాజా కూరగాయాలనే వాడాలని సూచించారు. నాణ్యతలో ఎలాంటి రాజీపడొద్దని అన్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంట చేసే సమయంలో, వడ్డించే సమయంలో తప్పనిసరిగా చేతులను శుభ్రం చేసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలిగేలా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంపీడీఓ కరీం, ప్రిన్సిపాల్ హరిత, ఉమా తదితరులు పాల్గొన్నారు.

అన్ని వసతులు ఉండాలి

బొంరాస్‌పేట: ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అన్ని వసతులు ఉండాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం మండలంలోని బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బియ్యం, అన్నం, పప్పు, కూరగాయలు, సరుకులు, వసతులను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులు ఆట స్థలం కావాలని కలెక్టర్‌ను కోరడంతో వెంటనే స్థలం కేటాయించాలని తహసీల్దారు ప్రభావతికి సూచించారు. తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్ మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యా ప్రగతి పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకన్‌గౌడ్, హెచ్‌ఎం విక్రమ్‌సింగ్, వార్డెన్ రాజన్న పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం వడ్డించాలి

దౌల్తాబాద్: ప్రభుత్వ వసతి గృహాలు, కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి సూచించారు. బుధవారం మండలంలోని కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించారు. ముందుగా విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం వంటలను పరిశీలించారు. వంట గదిని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆ తర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు ఏ సమస్యలు రాకుండా చూసుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ గాయత్రి, ఎస్‌ఓ జ్యోతి తదితరులు ఉన్నారు.



దౌల్తాబాద్: భోజనాన్ని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి

పారదర్శకంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇందిరమ్మ ఇళ్ల పథకం సర్వేను ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పక్కాగా, పూర్తి పారదర్శకంగా జరిగేలా చూస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతి కుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం, ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, గ్రూప్–2 పరీక్షల నిర్వహణ, నూతన డైట్ మెనూ ప్రారంభోత్సవం, సంక్షేమ హాస్టళ్ల తనిఖీ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడారు. మండల స్థాయి నుంచి ఇద్దరు, మున్సిపాలిటీల నుంచి నలుగురు చొప్పున ఎంపిక చేసి శిక్షణ ఇవ్వాలని సూచించారు.

ప్రగతి పథంలో దుద్యాల్

మండల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి

- పారిశ్రామికవాడ ఏర్పాటుకు కసరత్తు
- వేగంగా రోడ్డు విస్తరణ పనులు
- పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- హకీంపేట్‌కు జూనియర్, ఐటీఐ కళాశాలలు, ప్రజా వైద్యశాల మంజూరు
- హర్షం వ్యక్తం చేస్తున్న మండలవాసులు



చురుగ్గా సాగుతున్న దుద్యాల్ - హకీంపేట్ రోడ్డు విస్తరణ పనులు

దుద్యాల్: అభివృద్ధిలో దుద్యాల్ మండలం పరుగులు పెడుతోంది. కొడంగల్ తరహాలో ఈ మండలాన్ని అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పించారు. రెండేళ్ల క్రితం మండల కేంద్రంగా ఏర్పాటైనా ఎలాంటి పురోగతి సాధించలేదు. ప్రభుత్వ కార్యాలయాలకు నోచుకోలేదు. స్థానిక ఎమ్మెల్యే రేవంత్ సీఎం కావడంతో మండల దశ మారిపోయింది. అభివృద్ధికి వడివడిగా అడుగులు పడ్డాయి. గ్రామీణ రోడ్లకు నిధులు మంజూరయ్యాయి. మండల శివారు గ్రామమైన కుదురుమల్ల నుంచి దుద్యాల్ మీదుగా పోలేపల్లి శివారు వరకు రూ.50 కోట్లతో.. అలాగే దుద్యాల్ నుంచి సాగారం తండా, హంసంపల్లి, లింగాయపల్లి మీదుగా అంతర్రాష్ట్ర రహదారి హైదరాబాద్ వరకు రూ.28 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ప్రస్తుతం ఈ పనులు శర వేగంగా జరుగుతున్నాయి.

పరిశ్రమల ఏర్పాటుకు శ్రీకారం

మండలంలోని హకీంపేట్, పోలేపల్లి, లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండా గ్రామాల్లో కాలుష్య రహిత పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా పారిశ్రామికవాడ ఏర్పాటు కోసం భూములు సేకరించడానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. హకీంపేట్‌కు చెందిన 118 మంది రైతులు భూములు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. రెవెన్యూ అధికారులకు అంగీకార పత్రాలు కూడా అందజేశారు. త్వరలోనే పారిశ్రామకవాడ ఏర్పాటుకు శంకుస్థాపన చేసే అవకాశం ఉంది. మండలంలో పరిశ్రమలు ఏర్పాటు ప్రక్రియ పూర్తయితే ఈ ప్రాంత ప్రజలు, యువకులు, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయి. వేగంగా అభివృద్ధి జరగడంతోపాటు భూముల రేట్లు భారీగా పెరుగుతాయి.

కళాశాలలు, ఆస్పత్రి మంజూరు

మండలంలోని హకీంపేట్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఐటీఐ కళాశాల తోపాటు ప్రభుత్వ ఆస్పత్రిని మంజూరు చేసింది. జూనియర్, ఐటీఐ కళాశాలను వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించనున్నారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇలా మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. దీంతో మండల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్యాలయాల ఏర్పాటుకు సన్నాహాలు

కొత్తగా ఏర్పాటైన మండల కేంద్రంలో అన్ని శాఖలకు చెందిన ప్రభుత్వ కార్యాలయాలను నిర్మించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అన్ని శాఖ లు ఒకే చోట ఉండేలా మండల సమీకృత భవన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రైతువేదిక సమీపంలో గల ప్రభుత్వ స్థలాన్ని ఎంపిక చేశారు. అలాగే పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేస్తున్నారు. నూతన భవనం నిర్మించేంత వరకు తాత్కాలికంగా పల్లె దవాఖానాలో ఠాణ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవల పోలీస్ ఉన్నతాధికారులు సైతం ఏర్పాట్లను పరిశీలించారు. రెండేళ్ల క్రితం 21 గ్రామ పంచాయతీలతో దుద్యాల్‌ను రెవెన్యూ మండలంగా ఏర్పాటు చేశారు. ఇటీవల మండల పరిషత్ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు.

అన్ని రంగాల్లో అభివృద్ధి



నూతనంగా ఏర్పడిన మండలాన్ని గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. కనీస వసతులు కూడా కల్పించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మండలం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోంది. కొడంగల్ తరహాలో దుద్యాల్ మండలాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారు.

– ఆకారం వేణుగోపాల్, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, దుద్యాల్

క్లుప్తంగా

నేడు నగరానికి అంగన్‌వాడీ టీచర్లు



ఐసీడీఎస్‌ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

కొడంగల్‌ రూరల్‌: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని గురువారం హైదరాబాద్‌లో చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య కోరారు. బుధవారం ఐసీడీఎస్‌ కార్యాలయంలో అంగన్‌వాడీ సిబ్బంది ధర్నాకు వెళుతున్నట్లు వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ టీచర్లకు కనీసవేతనం రూ.18 వేలు అందించాలని, రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ అందించాలని, ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నాకు వెళుతున్నట్లు చెప్పారు.

కాంగ్రెస్‌ నేతలకు సన్మానం



కొడంగల్‌ రూరల్‌: ఇటీవల నూతనంగా ఎన్నికైన యూత్‌ కాంగ్రెస్‌ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్‌, ఉపాధ్యక్షుడు కృష్ణంరాజును బుధవారం కాంగ్రెస్‌ పార్టీ నాయకులు సన్మానించారు. ఇరువురికి పార్టీ నాయకులు ఎస్‌ఎం.గౌసన్‌, సోమశేఖర్‌, వెంకటేష్‌, అహ్మద్‌ఖాన్‌, నర్సిములు శాలువాలు కప్పి సత్కరించారు.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం



ఏటీఎం సెంటర్‌ వద్ద ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

ఆమనగల్లు: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ ఆవరణలో ఉన్న ఇండియా–1 ఏటీఎంలో మంగళవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తి చోరీకి విఫలయత్నం చేశాడు. ఈ సంఘటనకు సంబంధించి ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ ఆవరణలో ఇండియా–1 ఏటీఎం సెంటర్‌లోకి అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తి చొరబడి ఏటీఎం సెంటర్‌లో ఉన్న మిషన్‌ సేఫ్‌ లాకర్‌ను విరగొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. విషయం తెలియడంతో బుధవారం ఉదయం ఏటీఎం సెంటర్‌ను ఎస్‌ఐ వెంకటేశ్‌, క్లూస్‌ టీం పరిశీలించి ఆధారాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి కింద పడి వ్యక్తి దుర్మరణం!



నందిగామ: రైలు నుంచి ప్రమాదవశాత్తు కిందపడి ఓ వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన మండల పరిధిలోని పారిశ్రామిక వాడలో బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌ కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌ కథనం ప్రకారం.. మండల పరిధిలోని హెచ్‌బీఎల్‌ రైల్వేగేట్‌ సమీపంలో గుర్తు తెలియని ఓ వ్యక్తి(30) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఘటనాస్థలిని పరిశీలించిన పోలీసులు ప్రమాదవశాత్తు రైలు నుంచి కిందకు జారిపడి దుర్మరణం చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడి ఎడమ చేయిపైన 'ప్రియాంక' అనే పచ్చబొట్టు ఉందని, ఎరుపు రంగు టీషర్టు, బ్లూ కలర్‌ జీన్స్‌ ప్యాంట్‌ ధరించి ఉన్నాడని తెలిపారు. తిమ్మాపూర్‌ స్టేషన్‌ మాస్టర్‌ రాజేందర్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని షాద్‌నగర్‌ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించినట్లు హెడ్‌కానిస్టేబుల్‌ శ్రీనివాస్‌ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

ఘనంగా గీతా జయంతి

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



అనంతగిరి: వికారాబాద్‌లోని శివాజీనగర్‌లో గీతా పారాయణం

అనంతగిరి: వికారాబాద్‌ పట్టణం శివాజీనగర్‌ మైసమ్మ కట్టపై ఏకాదశిని పురస్కరించుకుని గీతా వాహిణి ఆధ్వర్యంలో గీతా జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం గీతాయజ్ఞం, సామూహిక గీతా పారాయణం గావించారు. ఈ కార్యక్రమంలో గీతావాహిణి వికారాబాద్‌ అధ్యక్షురాలు శ్రీదేవి సదానంద్‌రెడ్డి పాల్గొన్నారు.

భగవద్గీత కంఠస్థ పోటీలు

టీటీడీ–హిందూ ధర్మ ప్రచార పరిషత్‌ ఆధ్వర్యంలో గీతాజయంతిని పురస్కరించుకుని వికారాబాద్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. న్యాయ నిర్ణేతలుగా గీతావాహిని ప్రతినిధులు శ్రీదేవి, లావణ్య, మమత, దివ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అసిస్టెంట్‌ గూడూరు హరినాథ్‌, దేవాలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌ లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు చండీశ్వర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, బల్వంత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్‌ రూరల్‌: పట్టణంలోని శ్రీమహాలక్ష్మి వేంకటేశ్వర స్వామివారి దేవాలయంలో బుధవారం ఆలయ ధర్మకర్తలు, హిందూ ధార్మిక సేవా సభ్యులు భక్తిశ్రద్ధలతో గీతా జయంతి నిర్వహించారు. ఉదయం 10 గంటలకు గీతా పారాయణం, దేవాలయంలో స్వామివారికి అభిషేకం, శ్రీకృష్ణ భగవాన్‌కు, భగవద్గీతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 18 అధ్యాయాలు పారాయణం చేశారు.



కొడంగల్‌ రూరల్‌: శ్రీకృష్ణ భగవాన్‌కు హారతి ఇస్తున్న ఆలయ పురోహితులు



దోమ: కొత్తపల్లిలో గీతాయజ్ఞంలో మాజీ సర్పంచ్‌ కుంట రాములు

దోమలో..

దోమ: కొత్తపల్లి గ్రామంలో మాజీ సర్పంచ్‌ కుంట రాములు గీతా యజ్ఞాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు కృష్ణ స్వామితో గీతాపారాయణం, విష్ణుసహస్రనామం, హనుమాన్‌ చాలిసాతో యజ్ఞాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు.

ఘనంగా గీతా జయంతి

ధారూరు: మండల కేంద్రంలోని శ్రీపాండురంగ స్వామి దేవాలయంలో బుధవారం పూజారి కుమారస్వామి ఆధ్వర్యంలో మహిళలు గీతా జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భగవద్గీతా పుట్టిన రోజును పురస్కరించుకుని గ్రామంలోని మహిళలు శ్రీపాండురంగస్వామి దేవాలయానికి చేరుకుని అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు.

భోజనంలో నాణ్యత తప్పనిసరి

అదనపు కలెక్టర్‌ సుధీర్‌



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్‌, ఆర్డీఓ, తహసీల్దార్‌ తదితరులు

అనంతగిరి: పాఠశాలల్లో నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్‌ సుధీర్‌ ఉపాధ్యాయులకు సూచించారు. ఈమేరకు బుధవారం ఆయన వికారాబాద్‌ మండల పరిధిలోని గొట్టిముక్కుల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గోధుమగూడ ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వంటగది, డైనింగ్‌ హాల్‌ను పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంట చేసేటప్పుడు, భోజనం వడ్డించే క్రమంలో చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వంటగదిని ఎప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్‌ లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

ఎంపీడీఓ ఆధ్వర్యంలో

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని జిల్లా, మండల అధికారులు ఏకకాలంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మండల పరిధిలోని ఎర్రవల్లి స్కూల్‌ను ఎంపీడీఓ వినయ్‌కుమార్‌, నారాయణపూర్‌లో ఎంపీఓ దయానంద్‌లు పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

ప్రజాపాలన దరఖాస్తులపై సమీక్ష



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శరత్‌, కలెక్టర్‌ ప్రతీక్‌ జైన్‌

అనంతగిరి: ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల అప్‌లోడ్‌ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. బుధవారం రాష్ట్ర సచివాలయం నుంచి ముఖ్య కార్యదర్శి శాంతికుమారి, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌ రెడ్డిలు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్‌ సెక్రటరీ శరత్‌, జిల్లా కలెక్టర్‌ ప్రతీక్‌జైన్‌ పాల్గొన్నారు. వీరు పరిగి తహసీల్దార్‌ కార్యాలయం నుంచి హాజరయ్యారు. కలెక్టరేట్‌ నుంచి ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు లింగ్యా నాయక్‌, అసిస్టెంట్‌ కలెక్టర్‌ ఉమాహారతి, హౌసింగ్‌ అధికారులు కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాపాలనలో వచ్చిన ఇళ్ల దరఖాస్తు అప్‌లోడ్‌ ప్రక్రియ, వసతి గృహాల్లో వసతులు, గ్రూప్‌–2 పరీక్షల నిర్వహణ తదితరల అంశాలపై మంత్రి సూచనలు ఇచ్చారు.

ఆటలు సరే.. వసతులేవి?



ట్యాంక్‌ వద్ద నీటిని తాగుతున్న విద్యార్థులు

నిధులలేమితో సీఎం కప్‌ నిర్వహణ



క్రీడలు ఆడుతున్న విద్యార్థులు

కుల్కచర్ల: పేరుగొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా మారింది 'సీఎం కప్‌' పోటీల నిర్వహణ. కనీసం క్రీడాకారులకు మధ్యాహ్న భోజనం పెట్టడానికి సైతం నిధులు విడుదల చేయని దుస్థితి నెలకొంది. కుల్కచర్ల మండలంలో బుధవారం ప్రారంభమైన సీఎం కప్‌ క్రీడా పోటీల్లో భాగంగా మండల పరిధిలోని బండవెల్కిచర్ల గురుకుల పాఠశాలలో వివిధ పోటీలను నిర్వహించారు. కాగ ఇందులో పాల్గొన్న క్రీడాకారులకు తాగేందుకు కనీసం మంచినీరు సైతం ఏర్పాటు చేయకపోవడం విస్మయానికి గురి చేస్తుంది. భావిభారత క్రీడాకారులుగా పేర్కొంటున్నప్పటికీ కనీసం తాగునీరు, భోజనం అందించడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. సీఎం కప్‌ క్రీడల నిర్వహణకు రూ.15వేలు మంజూరైనట్లు ఎంపీడీఓ రామకృష్ణ పేర్కొనగా.. అవి కేవలం క్రీడల నిర్వహణకు అవసరమైన బాల్స్‌, నెట్స్‌ వంటివి కొనుగోలు చేయడానికి సరిపోయినట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం సమయంలో కేవలం కొందరికే సరిపోగా మళ్లీ స్థానికంగా ఉన్న పాఠశాల నుంచి భోజనం తీసుకొచ్చారు. సీఎం కప్‌ అంటూ జిల్లా స్థాయి అధికారులు గొప్పగా చెప్పుకొంటున్నా.. నిధులు విడుదల చేయకపోవడంతో స్థానికంగా పలువురు రాజకీయ నేతలను ఆశ్రయిస్తున్నారు. క్రీడాకారులకు వెలికితీసేందుకు విరివిగా నిధులు విడుదల చేయాల్సిన అధికారగణం ఇలా నిరుపేద క్రీడాకారుల భవిష్యత్తును అపహాస్యం చేయడమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా క్రీడల అభ్యున్నతికి అధికారులు అధిక నిధులు విడుదల చేసి క్రీడాకారుల అభ్యున్నతికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బొంరాస్‌పేట: యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ఐదు ట్రాక్టర్లను బుధవారం ఎస్సై ఎండీ రవూఫ్‌ పట్టివేశారు. మండల పరిధిలోని మహంతీపూర్‌ వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తాలూకా కేంద్రం కొడంగల్‌కు తరలిస్తుండగా నాగిరెడ్డిపల్లి రైస్‌మిల్లు వద్ద పోలీసులు పట్టివేశారని తెలిపారు. ఈ మేరకు ఇసుక ట్రాక్టర్లను పోలీసు స్టేషన్‌కు తరలించి డ్రైవర్లలైన శివకుమార్‌, సుదర్శన్‌, లాలప్ప, రవి, నర్సింలులపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

హాస్టల్‌ వార్డెన్‌ అదృశ్యం

మొయినాబాద్‌: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన హాస్టల్‌ వార్డెన్‌ అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వసంత్‌రెడ్డి అదే గ్రామంలో ఉన్న స్వామినారాయణ్‌ గురుకుల పాఠశాల హాస్టల్లో వార్డెన్‌గా పనిచేస్తున్నాడు. కాగా ఈ నెల 9న మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆయన ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య నవిత బుధవారం మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఫార్మసిస్టులు నైపుణ్యం పెంచుకోవాలి



అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న కళాశాల బృందం

మొయినాబాద్‌రూరల్‌: ఫార్మసిస్టులు ప్రపంచంలోని ప్రజలందరికి ఉపయోగపడేలా నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని రాష్ట్ర ఔషధ నియంత్రణ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ అనిల్‌కుమార్‌ పేర్కొన్నారు. మండలంలోని అమ్డాపూర్‌ చౌరస్తాలో భాస్కర ఫార్మసీ కళాశాలలో ప్రధానమంత్రి కౌశల్‌ వికాస్‌ యోజన కింద నైపుణ్య అభివృద్ధి శిక్షణ కార్యక్రమాన్ని నాలుగు రోజుల పాటు కళాశాల కార్యదర్శి జె.వి.కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. బుధవారం రాష్ట్రంలోని ఫార్మసీ కళాశాలల నుంచి 30 మంది ఫార్మసిస్టులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌ మాట్లాడుతూ.. అన్ని వృత్తి విద్యల్లో ఫార్మసీ కీలకమన్నారు. ఫార్మసిస్టులు ఆరోగ్య నిర్వహణలో ముఖ్య పాత్ర పోషిస్తారని సూచించారు. ఫార్మసీ విద్య వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ఇటువంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మసీ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా సభ్యుడు డాక్టర్‌ సుధీర్‌కుమార్‌, జె.బి.ఎడ్యుకేషన్‌ సొసైటీ డైరెక్టర్‌ ప్రొఫెసర్‌ సంజయ్‌ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన షురూ

సాక్షి, సిటీబ్యూరో: ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ మొదలైంది. ఈమేరకు ప్రజాపాలనలో గ్రేటర్‌ హైదరాబాద్‌ మహానగర పాలక సంస్థ (జీహెచ్‌ఎంసీ)లోని 150 వార్డుల నుంచి 10,40,537 మంది, సికింద్రాబాద్‌ కంటోన్మెంట్‌ బోర్డ్‌లోని 8 వార్డుల నుంచి 29,909.. మొత్తంగా 10,70,446 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఈమేరకు ఆయా దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు సర్వేయర్లు, మానిటరింగ్‌, సూపర్‌వైజింగ్‌ ఆఫీసర్లను జీహెచ్‌ఎంసీ నియమించింది. జీహెచ్‌ఎంసీ జోనల్‌ కమిషనర్లు ప్రతి వార్డుకు ఇద్దరు లేదా ముగ్గురి చొప్పున 150 వార్డులకు సర్వేయర్లను నియమించారు. అత్యధికంగా హైదరాబాద్‌లో 5,00,822 దరఖాస్తులు రాగా.. అత్యల్పంగా సంగారెడ్డిలో 20,711 అప్లికేషన్లు వచ్చాయి. మేడ్చల్‌–మల్కాజ్‌గిరిలో 3,22,064, రంగారెడ్డిలో 1,96,940, కంటోన్మెంట్‌లో 29,909 దరఖాస్తులు వచ్చాయి.

గణితంపై పట్టు సాధించాలి

తెలంగాణ మ్యాథమెటిక్స్‌ ఫోరం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్‌



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో గణిత ఫోరం ప్రతినిధులు

అనంతగిరి: కష్టంతో కాకుండా ఇష్టంతో గణితాన్ని నేర్చుకోవాలని తెలంగాణ మ్యాథమెటిక్స్‌ ఫోరం జిల్లా అధ్యక్షుడు చిగుళ్లపల్లి వేణుగోపాల్‌ సూచించారు. బుధవారం వికారాబాద్‌ జిల్లా పరిషత్‌ బాలుర పాఠశాలలో జిల్లా స్థాయి గణిత ప్రతిభా పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు గణితం పట్ల భయం పోయేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. విద్యార్థులు కూడా గణితం అంటే భయాన్ని వీడి ఇష్టంతో చదవాలన్నారు. గణితాన్ని గెలిస్తే ప్రపంచాన్ని గెలిచినట్టేనని పేర్కొన్నారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశామన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. అనంతరం ఇటీవల రాష్ట్ర స్థాయిలో జ్ఞాన నంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పిలిగుండ్ల గణిత ఉపాధ్యాయుడు ఎండీ.మోసిన్‌ను జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, వీరేశం, శశిధర్‌, బసప్ప, అనిల్‌కుమార్‌, జగదీశ్వరి, రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌, వెంకటేశం, యశోద, నిర్మల, బాలకుమార్‌, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారు

శ్రీజ (కుల్కచర్ల), సారా బేగం, అక్షర (చన్గోముల్‌), ఎం.రిషిక (హస్నాబాద్‌), పి.రాధిక (తట్టేపల్లి), ఎం.మురళి (ఎన్కతల), బి.ఈశ్వర్‌ (కుల్కచర్ల, గురుకులం), డి.హరిణి (వికారాబాద్‌, సంగం లక్ష్మీబాయి), కె.హారిక (పరిగి, మోడల్‌ స్కూల్‌) రాష్ట్ర స్థాయిలో ఎంపికయ్యారు.

జర్నలిస్టులపై దాడి హేయం



పరిగి: మోహన్‌బాబుపై ఫిర్యాదు చేస్తున్న జర్నలిస్ట్‌ సంఘం నాయకులు



తాండూరు టౌన్‌లో ఆందోళన చేస్తున్న జర్నలిస్టులు

- నటుడు మోహన్‌బాబుపై చర్యలు తీసుకోవాలి
- జర్నలిస్ట్‌ సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్‌ ఎదుట ధర్నా

పరిగి: జర్నలిస్టులపై దాడి చేసిన నటుడు మోహన్‌బాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆ సంఘ నాయకులు డిమాండ్‌ చేశారు. కవరేజ్‌కు వెళ్లిన జర్నలిస్టులపై మోహన్‌బాబు దాడి చేయడంతో పరిగి జర్నలిస్ట్‌ సంఘం ఆధ్వర్యంలో బుధవారం పరిగి బస్టాండ్‌ ఎదుట ధర్నా నిర్వహించి, పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కవరేజ్‌కు వెళ్లిన జర్నలిస్ట్‌పై దాడి చేయడం సమంజసం కాదన్నారు. మీడియాపై నటుడు దాడి చేయడం సిగ్గుచేటన్నారు. రోజు రోజుకు జర్నలిస్టులపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సినీనటుడు మోహన్‌బాబును వెంటనే అరెస్ట్‌ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జర్నలిస్ట్‌ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

తాండూరులో జర్నలిస్టుల నిరసన

తాండూరు టౌన్‌: న్యూస్‌ కవరేజ్‌కు వెళ్లిన జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్‌ బాబు అకారణంగా దాడి చేయడం హేయనీయమని పలువురు జర్నలిస్టులు అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలోని అంబేడ్కర్‌ చౌక్‌లో జర్నలిస్టులు నిరసన వ్యక్తం చేశారు. కాగా బీజేపీ నేతలు జర్నలిస్టులకు మద్దతు తెలిపారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి సమస్యల పరిష్కారంలో వారధిగా ఉండే జర్నలిస్టులపై భౌతిక దాడులకు దిగడం సమంజసం కాదన్నారు. నిరసనలో జేజేపీ నేతలు రమేష్‌కుమార్‌, భద్రేశ్వర్‌, లలిత, శ్రీలత, మల్లేశం, జర్నలిస్టులు వేణుగోపాల్‌ రెడ్డి, శాంతు, వెంకట్రామ్‌ రెడ్డి, ఆర్‌వీ రెడ్డి, శివానంద్‌, నవీన్‌, కృష్ణ, శ్రీను, కుమార్‌, వెంకట్‌, ముక్తార్‌ తదితరులు పాల్గొన్నారు.

జేబు దొంగలతో జాగ్రత్త

ఏఎస్‌ఐ పుండరీకం



బస్టాండులో ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మోమిన్‌పేట: బస్సులో ప్రయాణించే సమయంలో జేబు దొంగల పట్ల ప్రయాణికులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌ఐ పుండరీకం పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్‌టీసీ బస్టాండులో ప్రయాణికులకు చోరీలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బస్సు ఎక్కే, దిగే సమయంలో ప్రయాణికులు సెల్‌ఫోన్‌, బంగారు ఆభరణాల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. గుర్తు తెలియని ఆటోలో ఒంటరిగా మహిళలు ప్రయాణించవద్దన్నారు. పొలాలకు వెళ్లే సమయంలో మహిళలు బంగారు ఆభరణాలను వేసుకోవద్దని సూచించారు. ఇంటికి తాళం వేసి రాత్రికి ఎక్కడికి వెళ్లకూడదన్నారు. ఒక వేళ వెళ్లాల్సి వస్తే ఇంటి పక్కన వారికి చెప్పి వెళ్లాలన్నారు. సైబర్‌ నేరాలపై జాగ్రత్తగా ఉండాలన్నారు. బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు పోయిన వెంటనే 1930కి కాల్‌ చేయాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్‌ కానిస్టేబుల్‌ దత్తాత్రి తదితరులు ఉన్నారు.

వా'నర' సాయం



కోతికి నీళ్లు తాగిస్తున్న ఉస్మాన్‌

ధారూరు: ఒకప్పుడు మనుషులను చూస్తేనే కోతులు పారిపోయేవి. ప్రస్తుతం కోతులను చూస్తే మనుషులు పరుగు తీసే పరిస్థితులు వచ్చాయి. దీంతో ఎవరూ వాటి దగ్గరికి వెళ్లేందుకు సాహసించడం లేదు. మండల కేంద్రంలోని కూరగాయల మార్కెట్లో బుధవారం సాయంత్రం విద్యుత్‌ స్తంభం ఎక్కిన ఓ కోతి షాక్‌కు గురై కింద పడిపోయింది. స్పృహ కోల్పోయిన మర్కటాన్ని గమనించిన స్థానికుడు ఉస్మాన్‌ వానరాన్ని పట్టుకుని సపర్యలు చేశాడు. కాళ్లు, చేతులు రుద్దడంతో కొద్దిసేపటికి తేరుకుంది. దీంతో ఓ గిన్నెలో నీళ్లు తెచ్చి తాగించాడు. అనంతరం ఉస్మాన్‌ వైపు కృతజ్ఞతగా చూస్తూ.. కోతి తన గుంపులో కలిసి వెళ్లిపోయింది.

మట్టి తరలిస్తున్న వాహనాల సీజ్‌

మాడ్గుల: మండలంలోని అందుగుల గ్రామ శివారులోని ఎర్రకుంట చెరువు నుంచి మంగళవారం రాత్రి అక్రమంగా ఎర్రమట్టి తవ్వి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్‌ చేసినట్లు సీఐ జగదీశ్‌ తెలిపారు. పెట్రోలింగ్‌ నిర్వహిస్తున్న పోలీసులు గమనించి ప్రశ్నించగా.. ఎలాంటి అనుమతులు లేవని చెప్పడంతో వాటిని సీజ్‌ చేసినట్లు చెప్పారు. జేసీబీ, ట్రాక్టర్‌ డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

'మార్ఫింగ్‌' బ్లాక్‌మెయిల్‌!

- ముగ్గురు యువకులను చితకబాదిన బాధితురాలి భర్త, బంధువులు
- ఇబ్రహీంపట్నం పీఎస్‌ పరిధిలో ఘటన



గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సాయి, సురేష్‌

ఇబ్రహీంపట్నం: వరుసకు సోదరులైన వారే.. ఓ వివాహిత ఫొటోలను మార్ఫింగ్‌ చేసి ఇన్‌స్టాగామ్‌లో పెడుతామని బ్లాక్‌మెయిల్‌కు యత్నించారు. విషయాన్ని ఆమె తన భర్తకు చెప్పడంతో బంధువులతో కలిసి చితకబాదారు. ఇబ్రహీంపట్నం పీఎస్‌ పరిధిలో బుధవారం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ చందర్‌ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత (21) సమీప బంధువైన (వరుసకు సోదరుడు) సురేష్‌తో కలిసి దిగిన ఫొటోలను మార్ఫింగ్‌ చేసి ఇన్‌స్టాగామ్‌లో పెడతామని తొర్రూర్‌ గ్రామానికి చెందిన సాయి, విజయ్‌ (వీరు కూడా వరుసకు సోదరులే) బ్లాక్‌ మెయిల్‌ చేశారు. విషయాన్ని బాధితురాలు తన భర్త రాఘవేందర్‌కు తెలియజేసింది. దీంతో సురేష్‌, సాయి, విజయ్‌కు ఫోన్‌ చేసిన రాఘవేందర్‌ మాట్లాడుకుందాం రమ్మంటూ నాగన్‌పల్లి సమీపంలోని ఓ వ్యవసాయ క్షేత్రానికి పిలించాడు. అప్పటికే అక్కడ ఉన్న రాఘవేందర్‌ బంధువులు ఎన్‌.రాములు, కుమరయ్య, యాదమ్మ, విజయ్‌, సాయి, భరత్‌పై దాడికి పాల్పడ్డారు. కర్రలు, వైర్లతో ఇష్టానుసారం కొట్టారు. ఈ మేరకు ఫిర్యాదు రావడంతో అక్కడికి వెళ్లిన పోలీసులు బాధితులను ఆస్పత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పరువు నష్టం కేసులో విచారణకు 'బండి' గైర్హాజరు

సిటీ కోర్టులు: కేంద్రమంత్రి బండి సంజయ్‌పై నమోదైన కేసు విచారణకు ఆయన గైర్హాజరు అయ్యారు. 2022 అక్టోబర్‌లో మునుగోడు అసెంబ్లీ ఉపఎన్నికల ప్రచారంలో బీఆర్‌ఎస్‌ నాయకులను దండుపాళ్యం బ్యాచ్‌గా..దోపిడీ దొంగలుగా అభివర్ణించారని మంత్రి బండి సంజయ్‌పై పరువునష్టం కేసు నమోదవగా.. కోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈ విచారణకు బండి సంజయ్‌ గైర్హాజరు కావడంతో కోర్టు జనవరికి వాయిదా వేసింది.